సాక్షి
కుమురం భీం
శనివారం ၊ 1 ၊ మార్చి ၊ 2025



ఉపాధి మార్గం
కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో మిర్చి సేకరణ మహారాష్ట్ర కూలీలకూ ఉపాధి కల్పిస్తోంది. కాగా మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. 8లో▸



బస్సు సేవలు కరువు 9లో▸
మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణాలు చేస్తున్నారు. కానీ లింగాపూర్ మండలానికి ఆర్టీసీ బస్సు లేకపోవడంతో మహిళలు ఉచిత ప్రయాణానికి దూరమవుతున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /21.6

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత పెరుగుతుంది. తెల్లవారుజామున చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలి

- డీఆర్‌డీవో దత్తారాం



మాట్లాడుతున్న డీఆర్‌డీవో దత్తారాం

రెబ్బెన: ఉపాధి హామీ సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం కూలీలు పనులు చేయాలని డీఆర్‌డీవో దత్తారాం అన్నారు. శుక్రవారం మండలంలోని నక్కలగూడ శివారులో ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా చేపట్టిన ఫారంపాండ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ కూలీలందరూ రోజుకు రూ.300 కూలి పడేలా పనిచేయాలన్నారు. సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేస్తే కూలి వస్తుందన్నారు. రోజుకు 4 నుంచి 5 గంటలు పని చేయాలన్నారు. అనంతరం ఇందిరానగర్ నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో, ఈసీ, టీఏలు, ఎఫ్‌ఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలకు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ ఇటీవల ఖమ్మంలోని శ్రీ చైతన్య విద్యా సంస్థలో యోగ నందిని అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న విద్యాసంస్థలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు సుశాంత్, అరుణ్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న ప్లాంటేషన్ అధికారులు

రెబ్బెన: ప్లాంటేషన్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌చార్జి మేనేజర్ జి.సురేష్ కుమార్ అన్నారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ మండల పరిధిలోని గంగాపూర్ ప్లాంటేషన్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతం, ప్లాంటేషన్‌ల మీదుగా వెళ్లే ప్రజలు సిగరేట్, బీడీ, చుట్టలు తాగి నిర్లక్ష్యంగా పడేయడంతో అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్లాంటేషన్‌లు పరిసర ప్రాంతాల వారికి స్వచ్ఛమైన గాలిని అందిస్తూ పర్యావరణానికి ఎంతో దోహదం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వాచర్‌లు వెంకటేష్, గంగయ్య పాల్గొన్నారు.

అటవీ భూములను పరిరక్షించాలి




డంప్‌యార్డులను పరిశీలిస్తున్న మోహన్

రెబ్బెన: అటవీ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని సింగరేణి అటవీశాఖ సలహాదారుడు మోహన్ పరిగణ్ అన్నారు. శుక్రవారం జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్‌తో కలిసి బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. కైరిగూడ ఓసీపీ ఓబీ డంప్‌లను పరిశీలించారు. అటవీశాఖ అనుమతులు పొందిన భూముల్లో చేపట్టిన పనులు, నిర్మాణాలు, ఓబీ డంప్‌యార్డులపై నాటిన మొక్కలు, ఎదిగిన వృక్షాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి నరేందర్, ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, బీపీఏ ఓసీపీ 2 మేనేజర్ మహేష్‌కుమార్, ఎస్టేట్స్, ఆర్జీ–3 అధికారులు పాల్గొన్నారు.

సరిహద్దులో తేలని పట్టా

- రైతుల గోస పట్టేదెవరికి..?
- ఎడతెగని 12 గ్రామాల వివాదం
- సాగు భూమి పట్టాల కోసం నిరీక్షణ
- 2013 వరకు అందిన పహానీలు
- ఆన్‌లైన్, ధరణి కల్పించిన చిక్కులు
- 18 వేల ఎకరాల్లో 2 వేల మంది రైతులు



వివాదాస్పద గ్రామం ముకదంగూడ



పరంధోళి గ్రామంలోని సాగుభూమి

కెరమెరి(ఆసిఫాబాద్): తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల సరిహద్దులోని 12 గ్రామాల్లో రెండు రాష్ట్ర ప్రభుత్వాల పాలన సాగుతోంది. అయినప్పటికీ ఆయా గ్రామాల రైతులు అసౌకర్యాలతో కొట్టుమిట్టాడాల్సి వస్తోంది. ఆయా గ్రామాల్లో ఎలాంటి ఆదాయ వనరులు లేకపోవడంతో వ్యవసాయమే జీవనాధారంగా బతుకీడుస్తున్నారు. ఎలాంటి పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు లేవు. ఉన్న వ్యవసాయం చేస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. అనాదిగా ఆయా భూముల్లో సాగు చేస్తున్నా నేటికీ ఏ ప్రభుత్వం కూడా పట్టాలు అందించలేకపోయింది. ఫలితంగా ఏ ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలను అందుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం అటవీ భూముల్లో సాగు చేస్తున్న రైతుల భూములకు పట్టాలిస్తామని ప్రకటించింది. సర్వే కూడా చేయించింది. దీంతో రైతులు పట్టాలపై ఆశలు పెట్టుకున్నారు. కానీ అధిక మంది రైతులు ఎస్సీ కులానికి చెందిన వారు ఉండడం, 1930కి ముందు నుంచి స్థానికంగా ఉంటూ ఆధారాలు చూపాలి. అప్పటి ఆధారాలు లేకపోవడంతో ఒక్కరికి కూడా పట్టా అందలేదు.

18,374 వేల ఎకరాల్లో 1,878 మంది రైతులు

సరిహద్దులోని వివాదాస్పద పరంధోళి, ముకదంగూడ, అంతాపూర్, భోలాపటార్ గ్రామ పంచాయతీల్లో 12 గ్రామాలకు చెందిన 1,878 మంది రైతులు ఉన్నారు. వారంతా సుమారు 18,374 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సాగు చేస్తున్న రైతుల్లో 476 మంది రైతులు గిరిజనులు కాగా.. 1,300 మంది ఎస్సీలు, 102 మంది బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారున్నారు. అనేక ఏళ్ల నుంచి ఆయా గ్రామాల్లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని తమ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వారందరి ప్రధాన వృత్తి వ్యవసాయమే కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

2013 వరకు పహానీలు!

ఆ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న భూమి అధిక భాగంగా అటవీశాఖకు చెందింది. కాగా కొంత భాగం మాత్రమే రెవెన్యూ భూమి అని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 1995 నుంచి 2013 వరకు ఆయా గ్రామాలకు చెందిన రైతులకు మ్యాన్యువల్‌గా పహానీలను రెవెన్యూ అధికారులు ఇస్తూ వచ్చారు. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో పహానీలు అందుబాటులోకి రావడంతో వీరికి లభించలేదు. దీంతో రైతులు అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆందోళనలు చేస్తున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదు. బ్యాంకుల నుంచి రుణాలు అందక వ్యాపారుల వద్ద నుంచి వడ్డీలకు డబ్బులు తీసుకొని సాగు చేస్తున్నారు.

ఆధారాలు లభించలేదు.

2023లో సంయుక్తంగా అటవీ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సర్వే చేసినా సరైన ఆధారాలు లభించలేదు. గిరిజనేతర రైతులు 1930కి ముందు నుంచి అటవీ భూముల్లో సాగు చేస్తున్నట్లు, గిరిజనులు 2005 నుంచి సాగు చేస్తున్నట్లు ఆధారాలు చూపించాలి. గిరిజనేతరుల్లో 5శాతం రైతులకు కూడా 70 ఏళ్ల కిందటి ఆధారాలు లభించలేదు. అప్పటి నుంచి ఉన్న వృద్ధుల వాంగ్మూలం, పురాతన బావులు, శ్మశాన వాటికలు, ఆధార్ కార్డులు, ఓటర్‌ఐడీ కార్డులు, పురాతన కట్టడాలు తదితర 10 ఆధారాలు చూపించాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. గిరిజనులకు ఏదోలా అక్కడక్కడ లభిస్తున్నా గిరిజనేతరులకు 70 ఏళ్ల క్రితం నాటి ఆధారాలు లభించ లేదు.

బతకడం కష్టమవుతోంది..



అనాదిగా ఉన్న భూములను సాగు చేస్తూ కాలం వెల్లదీస్తున్నాం. ఏదో ఒక రోజు ప్రభుత్వం పట్టాలు ఇవ్వక పోతుందా అన్న నమ్మకంతో ఉన్నాం. కానీ గత ప్రభుత్వం 70 ఏళ్ల నాటి ఆధారాలు చూపెట్టాలని ఆంక్షలు విధించడంతో ఆశలు నీరుగారాయి. ప్రస్తుత ప్రభుత్వం స్పందించాలి. కనీసం అధికారులు పహనీలైనా ఇవ్వాలి. దీని వల్ల బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కాంబ్లె లక్ష్మణ్, రైతు, పరంధోళి

వ్యవసాయమే జీవనాధారం..



సరిహద్దు గ్రామాల్లో ఉన్న ప్రజలందరికీ వ్యవసాయమే జీవనాధారం. పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి రైతులకు అందే సంక్షేమ పథకాలు అందుకోలేక పోతున్నాం, అనేక ప్రభుత్వాలు వస్తున్నా మాదొక్కటే డిమాండ్. అదే సాగు చేస్తున్న భూములకు పట్టాలు కావాలని. ఏ ఒక్క ప్రభుత్వం మా సమస్యను తీర్చలేకపోతోంది.

– పతంగే లింబాదాస్, మాజీ సర్పంచ్, ముకదంగూడ

ప్రతీ ఉద్యోగికి రిటైర్మెంట్ సహజం



వసంత్‌ను సన్మానిస్తున్న డీపీఆర్వో సంపత్

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతీ ఉద్యోగికి రిటైర్మెంట్ సహజమని జిల్లా పౌరసంబంధాలశాఖ అధికారి సంపత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీపీఆర్వో కార్యాలయంలో పనిచేస్తూ శుక్రవారం పదవీ విరమణ పొందిన వసంత్‌కుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసంత్ కుమార్ సదరు విభాగానికి నిబద్ధతతో సేవ చేశారని కొనియాడారు. సర్వీసు మొత్తంలో ఎలాంటి రిమార్కు లేకుండా సేవలందించడం గొప్పతనమన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది రమేశ్, పాషా, వెంకటేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు సన్మానం

జిల్లాలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన జగ్గారావ్ దంపతులను జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావ్ జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ కరుణాకర్, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు విజయ శంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు స్వామి, ఎంటీవోఆర్ఐ అంజన్న, డీపీవో ఏవో శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు బర్డ్ ఫెస్టివల్

జన్నారం: మంచిర్యాల కలెక్టరేట్ ఆవరణలో శని, ఆదివారాల్లో కవ్వాల్ బర్డ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జన్నారం రేంజ్ అధికారి సుష్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లో కనిపించే వివిధ రకాల పక్షులు, వాటి వివరాలు, జీవ వైవిధ్యంలో వాటి పాత్రపై వివరిస్తారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల పక్షి ప్రేమికులు, పక్షుల అధ్యయనం చేసేవారు, ఎన్‌జీవోలు, జిల్లా అటవీ అధికారులు హాజరవుతారని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు పక్షులు, వన్యప్రాణులు, జీవ వైవిధ్యం, అడవుల ప్రయోజనాలను అవగాహన కల్పిస్తారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

‘పది’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో డీఈవో యాదయ్య, అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగనున్న ‘పది’ పరీక్షల కోసం జిల్లాలో 36 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 6,779 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, వెలుతురు, నిరంతర విద్యుత్ ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ప్రభాకర్, పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలి

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5 నుంచి జరుగనున్న ఇంటర్ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంటర్ పరీక్షలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, డీఐఈవో కళ్యాణి, విద్యుత్, పోలీస్, ఆర్టీసీ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యతపై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కార్మిక, ఉపాధి కల్పన, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, పరిశ్రమలు, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, షెడ్యూల్ కులాల సంక్షేమం, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు, సెర్ప్, మెప్మా అధికారులతో నిరుద్యోగ యువత-శిక్షణ-ఉపాధి కల్పన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతులకు జ్యూట్ బ్యాగుల తయారీ, ఎంబ్రాయిడరీ రంగాల్లో, యువకులకు భవన నిర్మాణ రంగం, పీవోబీ, పెయింటింగ్, ఎలక్ట్రీషియన్, మార్బుల్, ప్లంబింగ్ వంటి వాటిపై శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ అధికారి దత్తారాం, డీటీడీవో రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి

ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న సిమెంటు పనులను మార్చి నెలాఖరులోగా పూర్తిచేసేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అ న్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఆర్‌డీఏ దత్తారాంలతో కలిసి ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ఉపాధి హామీ పనుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన జీపీ, అంగన్‌వాడీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, నర్సరీల నిర్వహణ పనుల్లో కూలీల హాజరు శాతం పెంపుదలపై అధికా రులు దృష్టి సారించాలన్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతీ ఉపాధ్యాయుడు బోధనలో మెలకువలు నేర్చుకుని విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల నూతనంగా వచ్చిన 183 మంది కొత్త టీచర్లకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఇంటరాక్టీవ్ ఫ్లాట్ ప్యానల్‌ను, డిజిటల్ కంటెంట్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో ప్రారంభ పరీక్ష, మధ్య, అంత్య పరీక్ష ఫలితాలు నమోదు చేయాలన్నారు. విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు సాధించేలా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, హెచ్‌ఎం సుభాష్, రిసోర్స్ పర్సన్ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

సేవలతోనే గుర్తింపు

ఆసిఫాబాద్‌రూరల్: ఉద్యోగి తన వృత్తిని అంకిత భావంతో నిర్వర్తిస్తేనే సమాజంలో గుర్తింపు పొందుతారని డీఈవో యాదయ్య అన్నారు. ఇటీవల ఇన్‌చార్జి డీఈవో కార్యాలయ సహాయ సంచాలకులుగా పనిచేసిన గమానియల్ శుక్రవారం జిల్లా కేంద్రంలో మోడల్ స్కూల్ పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొని శాలువాతో సత్కరించారు. ఎస్‌వో శ్రీనివాస్, ఎంఈవో సుభాష్ పాల్గొన్నారు.

సెంటర్ చేరడం ఇక ఈజీ!

- ఇంటర్ హాల్‌టికెట్‌పై క్యూఆర్‌కోడ్‌
- పరీక్షా కేంద్రం, అడ్రస్, దూరం, ఇతర వివరాలు నిక్షిప్తం
- టోల్ ఫ్రీ, కంట్రోల్ రూం నంబర్లు కూడా...
- విద్యార్థులకు తప్పనున్న ఇబ్బందులు



కళాశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: ఇంటర్ చదువుతున్న విద్యార్థుల సౌలభ్యం కోసం ఇంటర్ బోర్డు నూతనంగా క్యూఆర్‌కోడ్ విధానాన్ని అమలు చేయనుంది. పరీక్షా కేంద్రం అడ్రస్ తెలియకపోయినా, దారి తప్పినా విద్యార్థులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల సమస్యలు, సందేహాలను తీర్చేందుకు ఇంటర్ బోర్డు క్యూఆర్ కోడ్‌తో హాల్‌టికెట్లు జారీ చేయనుంది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే పరీక్షా కేంద్రం, అడ్రస్, విద్యార్థి ఉన్న ప్రాంతం నుంచి సెంటర్ ఎంతదూరంలో ఉంది.. ఎన్ని నిమిషాల్లో చేరుకోగలరో సూచిస్తుంది.

తొలిసారి అమలు

ఇంటర్‌బోర్డు ఈ విద్యా సంవత్సరంలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఫిబ్రవరి 22 వరకు నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలను మొదటిసారిగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించింది. తాజాగా ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వార్షిక పరీక్షల కోసం నూతన విధానాన్ని అమలు చేయనుంది. హాల్‌టికెట్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యార్థుల సెల్ నంబర్లకు మెసేజ్ పంపించారు. పరీక్షా కేంద్రాల వివరా లు తెలుసుకునేందుకు హాల్‌టికెట్‌లపై క్యూఆ ర్ కోడ్, సందేహాలు నివృత్తి చేసుకునేందుకు టో ల్ ఫ్రీ, కంట్రోల్ రూం నంబర్లు ఏర్పాటు చేశా రు. నూతన విధానం ద్వారా ఇంటర్ విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉండదు.

10,054 మంది విద్యార్థులు

జిల్లాలోని 19 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో జనరల్ ఒకేషనల్ కోర్సుల్లో కలిపి మొత్తం 10,054 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం జనరల్, ఒకేషనల్‌లో కలిపి 4,758 మంది ఉండగా ద్వితీయ సంవత్సరంలో 5,296 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా మార్చి 5 నుంచి 22వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షలకు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్నారు.

ఇంటర్ వార్షిక పరీక్ష తేదీల వివరాలు

ప్రథమ సంవత్సరం	ద్వితీయ సంవత్సరం
05.03.25	06.03.25
07.03.25	10.03.25
11.03.25	12.03.25
13.03.25	15.03.25
17.03.25	18.03.25
19.03.25	20.03.25
21.03.25	22.03.25

మరిన్ని ఉపయోగాలు..

హాల్‌టికెట్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే రూట్ మ్యాప్ ఆధారంగా విద్యార్థులు సులువుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవచ్చు. అదేవిధంగా ఇంటర్ బోర్డు గత కొన్నేళ్లుగా హాల్‌టికెట్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించింది. కానీ డౌన్‌లోడ్ చేసుకునే విధానంపై సరైన అవగాహన లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇకపై ఆ సమస్య ఉండదు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్ అయ్యే తేదీ, హాల్‌టికెట్ నంబర్, విద్యార్థుల సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో రానున్నాయి. దీంతో విద్యార్థులు సులువుగా హాల్‌టికెట్‌ను పొందే అవకాశం ఏర్పడింది. నూతన విధానం ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు వర్తించనుంది.

సులువుగా సమాచారం

ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల సౌలభ్యం కోసం ఇంటర్‌బోర్డు తొలిసారిగా క్యూఆర్ కోడ్ విధానంతో హాల్‌టికెట్‌లు జారీ చేస్తోంది. దీంతోపాటు టోల్ ఫ్రీ, కంట్రోల్ రూం నంబర్లు కూడా ఉండేలా చూస్తోంది. విద్యార్థులకు ఎలాంటి సందేహాలున్నా కంట్రోల్ రూం నంబర్‌ను సంప్రదించాలి. అంతేకాకుండా పరీక్షా కేంద్రం అడ్రస్ సులువుగా తెలుసుకోవచ్చు. సమయానికి పరీక్షకు హాజరుకావచ్చు.

– సీహెచ్ కళ్యాణి, డీఐఈవో

‘శ్యాంనాయక్ వ్యాఖ్యలు సరికాదు’

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌పై చేసిన వ్యాఖ్యలను ఆ పార్టీ నాయకులు మూకుమ్మడిగా ఖండించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వాంకిడి, తిర్యాణి, రెబ్బెన, కెరమెరి మండలాల అధ్యక్షులతో కలిసి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు కార్యకర్తలను నిరుత్సాహపరిచేలా ఉండరాదన్నారు. పార్టీ అధ్యక్షుడితో పాటు నలుగురిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. ఐదు మండలాల నాయకులతో కలిసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. వసంత్‌రావ్ మాట్లాడుతూ శ్యాంనాయక్ కలుపు మొక్కల వంటి కొంతమందిని వెంటేసుకుని పార్టీకి తీవ్ర నష్టం చేస్తున్నారని ఆరోపించారు. అనీల్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించిన వారిని క్షమించే ప్రసక్తేలేదన్నారు. కెరమెరి మండల అధ్యక్షుడు కుసుంబరావ్ మాట్లాడుతూ శ్యాంనాయక్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు చరణ్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, నాయకులు దేవాజీ, గాదెవేణి మల్లేశ్, ఆసిఫ్, దీపక్‌ముండే, రవీందర్, మారుతీపటేల్, చిట్ల నారాయణ, బాబురావ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

ఇసుక అక్రమ నిల్వల గుర్తింపు



ఇసుక నిల్వల వద్ద పోలీసులు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం పులిమడుగు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను శుక్రవారం పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో తనిఖీ చేపట్టగా సుమారు 40 ట్రాక్టర్ల ఇసుక లభ్యమైంది. ఈమేరకు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించి ఇసుక నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే ట్రాక్టర్లు జప్తు

జన్నారం: ఇసుక రవాణాకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అనుమతి ఉందని, రాత్రివేళల్లో చేస్తే ట్రాక్టర్లను జప్తు చేస్తామని ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేసిన ట్రాక్టర్లకు ఇదివరకు జరిమానా విధించి వదిలేశామని, అయినా కొందరు ఇసుక తలిస్తున్నారని తెలిపారు. ఇంటి నిర్మాణాలు, ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసమే ఇసుకను అనుమతి ఉందన్నారు. అక్రమ కలప రవాణా చేస్తే చర్యలు ఉంటాయన్నారు. ఇందనపెల్లి రేంజ్ పరిధిలో అటవీ ఆంక్షలు విధించామని, ఎవరైన అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక లారీ బోల్తా

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ సమీపంలో శుక్రవారం ప్రమాదవశాత్తు ఇసుకలారీ బోల్తాపడింది. ఈ ఘటనతో ప్రమాదం తప్పింది. ఏఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాలు.. మంచిర్యాల నుంచి భైంసాకు లారీ ఇసుకలోడ్‌తో వస్తుంది. జాతీయ రహదారిపై ఒక్కసారి అదుపుతప్పి బోల్తాపడింది. కొద్ది దూరంలో భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న వాహనాలు నిలిపివేశారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ అశిష్‌యాదవ్‌కు స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని లారీని పక్కకు తీసి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఆరునెలల జైలు

మంచిర్యాలక్రైం: చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఆరునెలల సాధారణ జైలుశిక్షతోపాటు తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె.నిరోష శుక్రవారం తీర్పుచెప్పారు. మంచిర్యాల అశోక్‌రోడ్‌కు చెందిన పూదారి రమేశ్ వద్ద ఏసీసీ సుభాష్‌నగర్‌కు చెందిన నామిని రమేశ్ సొంత అవసరం నిమిత్తం రూ.4.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ష్యూరిటీ కింద చెక్కులు అందించాడు. అప్పు ఇచ్చిన గడువు దాటాక పూదారి రమేశ్ బ్యాంకులో చెక్కులు డిపాజిట్ చేయగా బౌన్స్ అయ్యాయి. బాధితుడు 2017లో కోర్టును ఆశ్రయించాడు. ఇరువురి వాదనలు అనంతరం నేరం రుజువు కావడంతో నామిని రమేశ్‌కు ఆరునెలల జైలుశిక్షతోపాటు తీసుకున్న అప్పు చెల్లించాలని మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు.

ఉపాధి మార్గం

- మిర్చి సేకరణతో 'మహా' కూలీలకు ఉపాధి
- సౌకర్యం కల్పిస్తున్న రైతులు

కోటపల్లి: వ్యవసాయమంటేనే వ్యయప్రయాసలతో కూడుకున్నది. పత్తి, వరి, మిర్చి పంట ఏదైనా సరే కూలీల భాగస్వామ్యం లేనిదే దిగుబడి రైతు చేతికి అందవు. రైతు సాగుచేసిన పంట తనతోపాటు మరో పదిమంది కూలీలకు ఆదరవు ఇస్తుందనడానికి నెలవుగా మారుతుంది మిరప పంట సాగు. కోటపల్లి, వేమనపల్లి సరిహద్దు ప్రాంతాల్లో ఏటా సాగవుతున్న మిరప పంట స్థానికులతోపాటు మహారాష్ట్ర కూలీలకు నాలుగు నెలల పాటు ఉపాధి కల్పిస్తోంది. వందలాది మహారాష్ట్ర కూలీలు మిరప, పత్తితో ఉపాధి పొందుతున్నారు.

ఏటా జోరుగా సాగు..

జిల్లాకు సరిహద్దున ఉన్న కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో ఏటా మిరప సాగు జోరుగా సాగుతోంది. గతేడాది మద్దతు ధర లేక రైతులు నష్టాల పాలైనప్పటికి ప్రత్యామ్నాయం లేక ఈసారి అదే పంటను సాగుచేయక తప్పలేదు. రైతుల కష్టాలను పక్కన పెడితే మిరప పంట అనేక మంది కూలీల కడుపు నింపుతోంది. మిరపను తెంపేందుకు స్థానిక కూలీలు సుముఖత ఉండకపోవడం వల్ల మహారాష్ట్ర కూలీలకు ఆదరవుగా నిలుస్తోంది. సుమారు నాలుగు నెలలపాటు మిరప కోతలతో ఉపాధి పొందేందుకు వందలాది కూలీలు తమ కుటుంబాలతో గ్రామాలను విడిచి వలసవస్తున్నారు. కోటపల్లి, వేమనపల్లి ప్రాణహిత సరిహద్దు గ్రామాల్లో వందలాది ఎకరాల్లో మిరప సాగవుతోంది. మిరపను చెట్ల నుంచి తెంపడం, ఆరబెట్టడం, గ్రేడింగ్ చేయడం బస్తాల్లో నింపడం లారీల్లో ఎక్కించడం తదితర పనులను చేయాల్సి ఉండటంతో ఇక్కడి రైతులు ఎక్కువగా మహారాష్ట్ర కూలీలపై ఆధారపడుతున్నారు. వీరికి భోజనం వసతి ఏర్పాటుతోపాటు రోజుకు రూ.300 చొప్పున కూలీ ఇస్తుండటంతో మిరప తోటల్లో ఎక్కడ చూసిన సరిహద్దు రాష్ట్రానికి చెందిన కూలీల సందడే కనిపిస్తోంది. చిన్నా,పెద్దా తేడా లేకుండా మిరప కోతలు చేపడుతూ కూలీలు తమ పొట్టపోసుకుంటున్నారు. పొరుగు రాష్ట్రాల కూలీలు సుమారు 20 వేల మందికి పైగా వస్తున్నట్లు అంచనా.

ఈ ఏడాది జిల్లాలో సుమారు 5వేల ఎకరాల్లో మిర్చి సాగైంది. రాంపూర్, కొల్లూర్, దేవులవాడ, లక్ష్మీపూర్, రాపన్‌పల్లి, ఆన్నారం, సిర్సా, పుల్లగామ, జనగామ, అర్జునగుట్టలో సుమారు 2 వేల ఎకరాల్లో పంట సాగైంది. మహారాష్ట్రలోని సిరోంచాతోపాటు జిమ్మలగట్టు, కమలాపూర్, ఒడ్డిగాం, ఇర్కపల్లి, మోట్లగూడెం, గుండెరా, రాపన్‌పల్లి, ఒడ్డిగాం, సూరయ్యపల్లి, అమరాశి, బామిని, ఇందారం, అబ్బన్‌పల్లి, జింగనూరు, తెకంపల్లి దేవులమర్రి తదితర గ్రామాలకు చెందిన కూలీలు ఇక్కడికి అధికంగా వస్తున్నారు. ప్రస్తుతం ఎలాంటి పనులు లేకపోవడంతో ఇక్కడ మిరప తోటల్లో కూలీ పనులు చేసేందుకు వస్తున్నామని వారు తెలుపుతున్నారు.



మిర్చి తీస్తున్న వలసకూలీలు

వలస కూలీలతో వెసులుబాటు

స్థానిక కూలీల రవాణా ఏర్పాట్లు, సమయ పాలన పాటించకపోవడం తదితర సమస్యలు ఎదురవుతుంది. ఈ నేపథ్యంలో రైతులు మహారాష్ట్ర కూలీలను ఆశ్రయించి వారితో పంట పనులు చేయిస్తున్నారు. వారికి రవాణా ఖర్చు లేకపోవడం, పొలాల్లోనే నివాసం ఏర్పరచుకోవడం ద్వారా కూలీ గిట్టుబాటు కావడం తదితర లబ్ధి చేకూర్చే ప్రయోజనాలు ఉంటున్నాయి.

మా వద్ద పనులు లేక



మా రాష్ట్రంలో పనులు లేక మిర్చి కోతలకు వచ్చాం. మూడేళ్లుగా ఉపాధి కోసం ఇక్కడికే వస్తున్నాం. అక్కడ పనులున్నా డబ్బు తక్కువ ఇస్తారు. అందుకే ఇక్కడకు వచ్చి మిర్చి కోతలు పూర్తయ్యే వరకు ఉంటాం.

– అర్జున్ కౌశిక్, ఛత్తీస్‌గఢ్

మిర్చి కోతలకు వచ్చాం



ఐదేళ్లుగా మిర్చి కోతలకు రాంపూర్‌కు వస్తున్నాం. భార్యబిడ్డలతో మమ్ముల్ని ఇక్కడి రైతులు బాగానే చూసుకుంటున్నారు. కుటుంబాలతో మూడు, నాలుగు నెలలు ఉండి కోతలు పూర్తయ్యాక వెళ్లిపోతాం.

– అత్మారామ్, రంగయ్యపల్లి, మహారాష్ట్ర

కూలీలకు సౌకర్యాలు



ఈ ఏడాది మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 50 మంది కూలీలు వచ్చారు. మిర్చి కొసేందుకు వచ్చిన వారికి కిలో రూ.12 చొప్పున ఇస్తూనే ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాది మిర్చి దిగుబడి తగ్గడమే కాక మార్కెట్‌లో ధర లేక పోవడం బాధగా ఉంది.

– కిష్టయ్య, రైతు, ఆలుగామ

వలస కూలీలపై ఆధారం



కూలీల కొరతతో వలస కూలీలపై ఆధారపడుతున్నాం. పొలాల్లో కూలీలకు కరెంట్, నీటి సౌకర్యం, బియ్యం, సరుకులు సమకూరుస్తున్నాం. ఈ ఏడాది ఆరు ఎకరాల విస్తీర్ణంలో మిర్చి సాగు చేయగా కూలీలతో కోయిస్తున్నా.

– చంద్రశేఖర్, రాంపూర్, రైతు

ఆర్జీయూకేటీలో జాతీయ సైన్స్ దినోత్సవం



నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, తదితరులు

బాసర: ఆర్జీయూకేటీలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైన్స్ ప్రాధాన్యతను విద్యార్థులు ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. తర్వాత విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ.మురళీదర్శన్, ఏవో శ్రీరణధీర్ సాగి, అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్, డాక్టర్ చంద్రశేఖర్, మహేశ్, హెచ్ఓడీలు దేవరాజు, సాయికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన కుస్తీపోటీలు



తలపడుతున్న మల్లయోధులు

కుంటాల: మహాశివరాత్రి పురస్కరించుకుని మండలంలోని ఓలా గ్రామంలోని శివాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. ముందుగా ఈ పోటీలను మాజీమంత్రి ఐకే రెడ్డి పీఏ శ్రీనివాస్ ప్రారంభించారు. తెలంగాణ, మహారాష్ట్ర నుంచి 200 మంది మల్లయోధులు వచ్చి పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన విజేతకు రూ.5వేల నగదుతోపాటు వెండి కడియం, రెండో విజేతకు రూ.3వేల నగదును శ్రీనివాస్ బహూకరించి సన్మానించారు. ఎస్సై సీహెచ్. భాస్కరాచారి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదివాసీ రైతులకు పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న రైతులు

బెల్లంపల్లి: అనాదిగా వస్తున్న పాత పంటలను సాగు చేస్తున్న బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) పరిధిలోని ఆదివాసీ రైతులకు పురస్కారాలు వరించాయి. శుక్రవారం హైదరాబాద్ వ్యవసాయ సాంకేతికత ప్రయోగ సంస్థ ఆధ్వర్యంలో జహీరాబాద్, సంగారెడ్డి జిల్లాలో పంట రకాలు, రైతుల హక్కుల పరిరక్షణపై రాష్ట్రంలోని కేవీకేలకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు, పాత పంటలు సాగు చేస్తున్న రైతులు హాజరయ్యారు. బెల్లంపల్లి కేవీకే పరిధిలోని కుమురం భీం జిల్లా తిర్యాణి మండలానికి చెందిన ఆదివాసీ రైతులు ఆత్రం భీంరావు, నైతం రఘులను పీపీవీఎఫ్ఆర్ఏ చైర్మన్ త్రిలోచన మహాపత్ర, అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరా శాలువ కప్పి సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు పంటల సాగు తీరు గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ శాస్త్రవేత్తలు, బెల్లంపల్లి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ, పీపీవీఎఫ్ఆర్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

కీచక హెచ్‌ఎంపై పోక్సో కేసు

భీమిని: మండల కేంద్రంలోని జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాలలో కీచక హెచ్‌ఎంపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న రేగుచెట్ల రమేశ్ 5వ తరగతి బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. బ్యాడ్ టచ్ చేయడంతో బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు హెచ్‌ఎంపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, బాలికలపై ఎక్కడ పడితే అక్కడ చేతులు వేసేవాడని రమేశ్‌పై ఆరోపణలు ఉన్నాయి.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు బలవన్మరణాలకు పాల్పడ్డారు. రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులు తీర్చలేక తండ్రి, భార్యతో గొడవ కారణంగా భర్త ఉరేసుకున్నారు.

రైలు కిందపడి యువకుడు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ జస్పాల్ సింగ్ కథనం ప్రకారం.. మందమర్రికి చెందిన సర్సపూరి వినయ్ (30) సింగరేణిలో కాంట్రాక్ట్ పద్ధతిలో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య భాగ్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా ఆయన మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చనిపోవడానికి ముందు కారణాలు చెబుతూ సెల్ఫీ వీడియో తీసుకున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపర్చినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. వినయ్ సెల్ఫీ వీడియో బయటకు వస్తే కారణాలు తెలిసే అవకాశం ఉందని కుటుంబీకులు, స్నేహితులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు తీర్చలేక తండ్రి..

తానూరు: కూతుళ్ల పెళ్లిళ్లకు చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో తండ్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని ఎల్వత్ గ్రామానికి చెందిన జాదవ్ పాండురంగ్ (40)కు ఐదుగురు కూతుళ్ల, ఒక కుమారుడు ఉన్నాడు. గతేడాది ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశారు. రూ.8 లక్షల వరకు అప్పు అయింది. మరో కుమార్తె వివాహానికి డబ్బులు లేవు. చేసిన అప్పులు ఎలా తీర్చాలనే బాధపడేవాడు. ఈక్రమంలో తాగుడికి బానిసయ్యాడు. గురువారం రాత్రి మద్యం మత్తులో ఇంటివెనుకల ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడు. కుటుంబీకులు, గ్రామస్తులు గమనించి అతన్ని ధర్మాబాద్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. భార్య సక్కుబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి..



వెంకటేశ్ (ఫైల్)

ఖానాపూర్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాహుల్‌గైక్వాడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని బీర్నంది గ్రామంలో గల రాజీవ్ తండాకు చెందిన బానావత్ వెంకటేశ్ (27) హైదరాబాద్‌లో కూలీ పనిచేస్తూ ఉంటున్నాడు. శివరాత్రి సందర్భంగా నాలుగు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఈక్రమంలో భార్య మీనాక్షితో పలు విషయాలపై గొడవ జరిగింది. దీంతో ఆమె తల్లిగారిల్లు అయిన కొమ్ముతండాకు వెళ్లింది. గురువారం భార్యను తీసుకువచ్చేందుకు వెంకటేశ్ అక్కడికి వెళ్లాడు. మామ బూక్య మణిరాం తిట్టడంతోపాటు బీరుసీసాతో వెంకటేశ్ తలపై కొట్టాడు. అవమానంగా భావించిన ఆయన అదేరోజు రాత్రి ఇంటికి వచ్చాడు. జీవితంపై విరక్తితో దూలానికి ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం బయటకు రాకపోవడంతో కుటుంబీకులు వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. తండ్రి లచ్చునాయక్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆలయంలో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మారమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ కథనం ప్రకారం.. పూజారి రాత్రి 9 గంటల సమయంలో ఆలయం మూసివేసి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఆలయం తెరిచి చూసేసరికి హుండీ పగులగొట్టి ఉంది. అందులో రూ.20వేల నగదుతోపాటు మూడు గ్రాములు ఉన్న అమ్మవారి రెండు పుస్తెల తాళ్లు, తులం వెండి ముక్కుపుడక అపహరణకు గురైంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసున్నారు.

యువకుడి హత్యాయత్నంపై నలుగురిపై కేసు

బెల్లంపల్లిరూరల్: యువకుడిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన నలుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్.రమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కన్నెపల్లి మండలం చర్లపల్లికి చెందిన దుర్గం మహేందర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి పంచాయతీ పరిధి చర్లపల్లిలో యజమాని ఇంటి వద్ద గురువారం రాత్రి వాహనాన్ని ఉంచడానికి వెళ్లాడు. ఈక్రమంలో మహేందర్ రోడ్డుపక్కన కంకులు అమ్ముకునేందుకు గుడిసె వేసే ప్రయత్నం చేశాడు. బెల్లంపల్లి మండలం చర్లపల్లికి చెందిన దుర్గం సాయి, దుర్గం సన్నీ, కోట బానేష్, మరో ఒకరు అక్కడి చేరుకుని అతనితో గొడవపడి దాడి చేశారు. మహేందర్ బొలెరో వాహనాన్ని తీసుకుని వెళ్తుండగా మరోమారు అడ్డుకుని దాడికి పాల్పడ్డారు. దుర్గం సన్నీ ఇంట్లో నుంచి కత్తి తీసుకువచ్చి మహేందర్ పొట్ట, ఛాతీ భాగంలో పొడిచి పరారీ అయ్యారు. తీవ్రగాయాలతో కిందపడిన ఆయన తల్లిదండ్రులు దుర్గం యశోద, పోషంలకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వారికి అక్కడికి చేరుకుని మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట ఆడుతున్న నలుగురి అరెస్టు

జన్నారం: మండలంలోని రేండ్లగూడ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ఎస్సై రాజ వర్ధన్ తెలిపారు. పక్కా సమాచారంతోనే వారిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ. 1600 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

వాగులో పడి ఒకరి మృతి

భైంసారూరల్: వాగులో ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతిచెందినట్లు ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు. మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన కాసర్ల భూమన్న(54) శుక్రవారం మేకలను తీసుకుని గ్రామ సమీపంలోకి మేపేందుకు వెళ్లాడు. మేకలు నీటిని తాగేందుకు సుద్ద వాగులోకి వెళ్లాయి. ఆ ప్రాంతంలో నీరు ఎక్కువగా ఉంది. ఒక మేక నీటిలో మునిగింది. గమనించిన భూమన్న నీటిలో దిగి కాపాడబోయి మునిగిపోయాడు. పక్కనున్న వారు గమనిస్తున్నలోపే పూర్తిగా నీటిలో మునిగి మృతిచెందాడు. కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

నాలాలో పడి వ్యక్తి..

భైంసాటౌన్: పట్టణంలోని సుభాష్‌నగర్‌లో నాలాలో పడి వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు..గోపాల్‌నగర్‌కు చెందిన సింధే శివాజీ(50) స్థానికంగా లేబర్ పనిచేస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం సుభాష్‌నగర్‌లోని డ్రెయినేజీపై కూర్చుని మద్యం తాగుతుండగా అదుపుతప్పి నాలాలో పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

బస్సును ఢీకొన్న మరో బస్సు

- ఇద్దరికి తీవ్ర, ఎన్నికల సిబ్బందికి స్వల్ప గాయాలు
- బస్సులు నిర్మల్, భైంసా డిపోలకు చెందినవి



డ్రైవర్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

గంగాధర: ఆర్టీసీకి చెందిన ఓ బస్సును మరో బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర, ఎన్నికల సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లాలో గురువారం నిర్వహించిన పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సులను సిబ్బంది భైంసా, నిర్మల్ డిపోలకు చెందిన రెండు బస్సుల్లో కరీంనగర్‌లోని స్ట్రాంగ్‌రూంకు తరలించారు. శుక్రవారం తెల్లవారుజామున తిరిగి వెళ్తున్నారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలికొండ, కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మంగపేట సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద స్పీడ్ బ్రేకర్ కారణంగా ముందు వెళ్తున్న నిర్మల్ డిపో బస్సు వేగం తగ్గింది. దీంతో వెనుక వస్తున్న భైంసా డిపో బస్సు దాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భైంసా డిపో బస్సు డ్రైవర్ మొయినొద్దీన్ కాలు విరగగా, పురుషోత్తం అనే వ్యక్తి ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఎన్నికల సిబ్బంది ప్రణయ్, ప్రియాంక, గంగాధర్, ముత్తన్న, రాజలింగం, స్వరూప, సూరజ్‌కుమార్, ప్రసిల్లా, ఎస్కే రఫీ, ఎస్కే అజీజ్, విక్రమ్, పృథ్వీ, ఎస్.అశోక్, పి.అభిలాష్, ఎ.రవి, సి.విక్రమ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. రైల్వే గేట్ మ్యాన్ ప్రదీప్ సమాచారంతో కొడిమ్యాల పోలీసులు, గంగాధర బ్లూకోల్ట్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

నెన్నెల: విధులు ముగించుకుని బైక్‌పై వెళ్తుండగా శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై ప్రసాద్ కథనం ప్రకారం.. నెన్నెల పోలీసుస్టేషన్‌లో బాగాల సంతోష్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని బైక్‌పై నెన్నెల నుంచి తన సొంతూరు ఎల్లారం వైపు వెళ్తున్నాడు. బొప్పారం సమీపంలోని నర్సరీ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో కుడి కాలు విరిగింది. తలకు, ముఖానికి తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలో రోడ్డుపై పడిపోయాడు. అటు వైపు వెళ్లే ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఘటనాస్థలికి చేరుకుని అతన్ని 108లో మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జనరల్ మజ్దూర్లు ఇక జనరల్ అసిస్టెంట్లు

- ఉత్తర్వులు విడుదల

శ్రీరాంపూర్: బొగ్గు పరిశ్రమల్లో జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్‌ను జనరల్ అసిస్టెంట్‌గా మారుస్తూ కోలిండియా యజమాన్యం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్ పేరు హుందాగా లేదని, దీన్ని మార్చాలని చాలా కాలంగా కార్మికులు, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. జేబీసీసీఐ స్టాండడైజేషన్ కమిటీలో డిమాండ్ చేశారు. ఎట్టకేలకు మారుస్తూ యజమాన్యం ఉత్తర్వులు విడుదల చేయడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది తమ పోరాట ఫలితమని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు.

రిటైర్డ్ కార్మికులకు పెరిగిన పెన్షన్ చెల్లించాలి



లేఖ చూపుతున్న రిటైర్డ్ కార్మికులు

పాతమంచిర్యాల: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు 11వ వేజ్‌బోర్డు కాలపరిమితిలో పెరిగిన పెన్షన్ చెల్లించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో గురువారం సంస్థ సీఎండీకి పంపించే బహిరంగ లేఖను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ వేజ్ బోర్డులో పదవీ విరమణ పొందిన కార్మికులకు 44 నెలల పెరిగిన పెన్షన్ ఏరియర్లు వెంటనే చెల్లించాలన్నారు. వితంతు పెన్షన్లు మంజూరు చేయాలని, మారుపేర్లను సరిచేయాలని, మెడికల్ కార్డుపై అధికారులకు చెల్లిస్తున్నట్లుగా రూ.25 లక్షలు వైద్యం కోసం అందించాలన్నారు. సొంతిల్లు లేని కార్మికులకు 200 గజాల స్థలం ఇవ్వాలన్నారు. నాయకులు వెంకటయ్య, జ్ఞానీ, రాజేశం, లక్ష్మణ్, చంద్రయ్య, రాంరెడ్డి, రాజయ్య, రామస్వామి పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన వలసజీవి మృతదేహం

సారంగాపూర్: దుబాయిలో గతనెల 16న ఉరేసుకున్న వలసజీవి మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన షేక్ అన్సార్ (34) ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం దుబాయి వెళ్లాడు. అక్కడ పూజైరా దిబ్బా మున్సిపల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చి వెళ్లాడు. గతనెల 16న కంపెనీ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని తోటి కార్మికులు కుటుంబీకులకు ఫోన్‌లో సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని కుటుంబ సభ్యులు ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పరికిపండ్ల స్వదేశ్‌ను కోరారు. దీంతో ఆయన ఇండియన్ ఎంబసీ కార్యాలయానికి మెయిల్ ద్వారా సమాచారం చేరవేయడంతోపాటు అక్కడే దుబాయిలో ఉన్న సామాజిక కార్యకర్త గుండెల్లి నర్సింహాకు విషయం తెలిపాడు. వీరిద్దరి సమన్వయం, రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మృతదేహం హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. అక్కడి నుంచి అంబులెన్స్‌లో శుక్రవారం స్వగ్రామానికి తరలించగా, అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, కూతురు(8), కుమారుడు (6) ఉన్నారు.